వైభవంగా తిమ్మప్ప బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నారాయణపేట రూరల్: గోవింద నామస్మరణతో ఎక్లాస్పూర్ గుట్ట మార్మోగింది. జిల్లా కేంద్రంలోని కొండపై వెలసిన బాలాజీ(తిమ్మప్ప)స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సంయుక్తంగా బుధవారం అర్ధ రాత్రి స్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అదే విధంగా గురువారం జరిగిన జాతర ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మట్టి కుండల్లో దాసంగాలు పెట్టి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా రథోత్సవం..

వేదమంత్రాల నడుమ శ్రీనివాస కల్యాణం, బుధవారం అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో అశేష భక్తజనం పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఉత్సవాల్లో సందడి చేశారు. పలువురు దాతలు భక్తులకు అన్నదానం, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జాతరలో రెట్టపట్లు..

జాతరలో నిర్వహించిన రెట్టపట్ల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకు జరిగిన రెటపట్ల కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత పాల్గొని తమ సత్తా చాటారు.



మెట్ల ద్వారా దేవాలయానికి వస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కలశాల ఊరేగింపు





కోలాటాలు, నృత్య ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు, ఆలయ గోపుర కలశాలతో భక్తులు

కొత్తకోట: మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులు ర్యాలీ నిర్వహించారు. ఉత్సవాల మొదటి రోజులో భాగంగా శ్రీకృష్ణ గోపుర కలశాలను ఊరేగింపుగా కొత్తకోటలోని రాఘవేంద్రస్వామి ఆలయం నుంచి శ్రీకృష్ణ ఆలయం వరకు పురవీధుల గుండా మహిళలు కోలాటాలు, చిన్నారుల నృత్యాలతో ఊరేగింపు కొనసాగించారు. మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు హిందువులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు సమకూర్చడంతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మరమ్మతుకు నోచుకోని సెంట్రల్ లైటింగ్



మరికల్: మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. మహబూబ్‌నగర్–రాయచూర్ రోడ్డుపై కిలో మీటర్ మేరా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ఏడాది పొడవునా ఒకటి వెలిగితే మరొకటి వెలుగదు. దాదాపు వంద వరకు బల్బులు వెలగకపోవడంతో జాతీయ రహదారిపై చీకట్లు కమ్ముకున్నాయి. అధికారులు స్పందించి సెంట్రల్ లైట్లకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సురక్షితంగా గమ్యం చేరుకోవాలి

నారాయణపేట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ రేవతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాహన తనిఖీల్లో పోలీసులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఊట్కూరు: ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏపీఓ కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపల్లి గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలో రోడ్లు, మురుగుకాల్వలు పరిశీలించారు. సిబ్బందికి పారిశుద్ధ్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్లభాష దినోత్సవం



ఆంగ్లభాషా దినోత్సవం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా: మండల పరిధిలోని కున్సీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆంగ్లభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమర యోధురాలు సరోజినీనాయుడు జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదే విధంగా ఆంగ్లభాష ఉపాధ్యాయుడు నరేందర్‌ను సన్మానించారు. హెచ్ఎం సంతోషి మాట్లాడుతూ.. సరోజినీనాయుడు జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సిములు, రమేష్, ఖాసీం, నరేందర్, అశ్విని, భారతి, సౌమ్య, నాగేష్, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్



నారాయణపేట: దామరగిద్ద మండలంలోని ఉల్లిగుండం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామస్తుల కథనం మేరకు.. చంద్రోల్ల వెంకటప్ప ఇంటి తాళం విరగొట్టి బీరువాలోని రూ.లక్ష ఇరవై వేల నగదు, తులం బంగారు చోరీ చేశారు. అదే విధంగా వేరే ఇళ్లలో దొంగతనానికి యత్నిస్తుండగా గమనించిన స్థానికులు వెంటపడ్డారు. ఈ నేపథ్యంలో దొంగలు వారి ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. స్థానికులు సమాచారం మేరకు ఏఎస్ఐ అరుణ్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

కోస్గి రూరల్: చెరువు కాలువలపై అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు సభ్యుడు వెంకటనర్సిములు అన్నారు. గురువారం ఇరిగేషన్ డీఈ ఆనంద్, తహసీల్దార్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాగులచెరువు కాలువపై డబ్బా వేసి కిరాయి వసూలు చేస్తున్నారని, గుండుమాల్ వెళ్లే రహదారి చెరువు కాలువపై ఏకంగా సూపర్ మార్కెట్ వ్యాపారాలు చేపడుతున్నారని, దండం చెరువు కాలువను ప్లాట్లుగా మార్చి విక్రయాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బీఆర్ఎస్ తరఫున పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోనేరు సాయప్ప, అనంతయ్య, వెంకట్‌రాములు, నవీన్, చెన్నయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మాజీ వార్డు సభ్యులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం



చిన్నారులను వాహనంలో తీసుకెళ్తున్న చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది

నారాయణపేట రూరల్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా చైల్డ్ హెల్ప్‌లైన్ పనిచేస్తుందని ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్లో చిన్నారులు యాచిస్తూ తిరగడాన్ని గుర్తించిన ప్రయాణికులు గురువారం 1098కు సమాచారం ఇచ్చారు. వెంటనే రెస్క్యూ ప్రొటెక్షన్ ఆఫీసర్ కరిష్మాతో కలిసి అక్కడికి చేరుకున్న బృంద సభ్యులు బస్టాండ్‌లో యాచిస్తూ తిరుగుతున్న ఆరుగురు చిన్నారులను గుర్తించారు. వెంటనే వారిని వాహనంలో తీసుకుని చైల్డ్ ప్రొటెక్షన్ సెంటర్‌కు తరలించారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులను బలవంతంగా యాచన వృత్తిలోకి పంపడం నేరమని, బాల కార్మికులను చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అదే విధంగా బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా మీనాజ్‌అహ్మద్

ఆత్మకూర్: మండలంలోని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ మీనాజ్‌అహ్మద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది డాక్టర్‌ను శాలువాతో సత్కరించారు.

క్లుప్తంగా

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



కోస్గి రూరల్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఎస్సీఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీబీ వెంకటేష్ అన్నారు. గురువారం దేవాలయ ప్రాంగణంలో రిజర్వేషన్ పరిరక్షణ సమితి సభ్యులు రంగరాజన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.రంగరాజన్‌పై రామరాజ్యం పేరుతో దాడి చేసిన వీరరాఘవ రెడ్డి, అతని బృందం సభ్యుల ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య వాదులు అందరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో మ్యాతరి బలరాం, దేవేంద్రప్ప, సుమలత, ఉప్పల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

మరికల్: మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులు వ్రతాల్లో పాల్గొన్ని మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సునంద మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు నాన్ ఓవెన్ ఫ్యాబ్రిక్ బ్యాగ్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నివారణకు ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. మన ప్రకృతిని మనమే కాపాడుకోవాలన్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్‌శెట్టిని అభినందిస్తూ పర్యావరణ పరిరక్షణపై బాధ్యతతో మెలగడం గొప్ప విషయమన్నారు. ప్లాస్టిక్ రహిత కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు హైదరాబాద్ దొంగ

కోస్గి: బహిరంగ సభలు, ర్యాలీలు లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్, జేబు దొంగ తనాలకు పాల్పడుతున్న హైదరాబాద్‌కు చెందిన దొంగను పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బాల్‌రాజ్ తెలిపారు. వివరాలు.. ఈనెల 9న కోస్గిలో జరిగిన కేటీఆర్ సభలో హైదరాబాద్‌కు చెందిన దొంగల ముఠా హాల్‌చల్ చేసింది. సభకు వచ్చిన వారిలో మూడున్నర తులాల బంగారం, రూ.9 వేల నగదు చోరీ జరిగినట్లు మూడు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన రవి, భీం, విశాల్, ఉస్సేన్, కేశవ్ అనే 5మంది పాత నేరస్తుల ముఠా దొంగతనం చేసినట్లు గుర్తించారు. నిఘా ఉంచిన పోలీసులు గురువారం ముఠాకు చెందిన కేశవ్‌ను పట్టుకుని విచారించారు. అతని నుంచి తులం బంగారం, రూ.25 వేల నగదు రికవరీ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మిగిలిన నలుగురు దొంగలు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

బస్సు కింద పడి వృద్ధురాలికి గాయాలు



మక్తల్: బస్సు కింద వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన పట్టణంలోని బస్టాండ్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పారిజాతమ్మ(80) తన కూమార్తెను రాయచూర్‌కు బస్సు ఎక్కించి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బస్టాండ్ ఆవరణలో నారాయణపేట నుంచి వస్తున్న బస్సు ముందు భాగంలోని టైర్ల కింద పడింది. ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలవగా మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు.

పౌష్టికాహారం అందించాలి

ఊట్కూరు: అంగన్‌వాడ్ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంపీఓ లక్ష్మీనర్సింహరాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి తగు సూచనలిచ్చారు. అనంతరం సీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఇందిర తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

మద్దూరు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కడా అధికారి వెంకటరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రూ.84.45 లక్షలతో నిర్మాణం చేపట్టినా నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో మరో 5 గదుల అవసరం ఉందని హెచ్ఎం నర్సింహారెడ్డి వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రూ.1.10 కోట్ల పంచాయతీ రాజ్ నిధుల నుంచి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనానికి పీఏసీఎస్ చైర్మన్ నర్సింహాతో కలిసి తిరుపతిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. రైతులకు అన్ని విధాలుగా ఉపయోగడేలా భవన నిర్మాణం చేపట్టాలని పీఆర్ డిప్యూటీ ఈఈ విలోక్‌కు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్‌కుమార్, కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, హన్మిరెడ్డి, మల్లికార్జున్, నరేందర్, బాబుస్వామి, డీఈఓ గోవిందరాజులు, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ రాములు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

నూతన మండలాల అభివృద్ధికి కృషి

కొత్తపల్లి: జిల్లాలో ఏర్పాటైన నూతన మండలాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలో సమీకృత భవనాల నిర్మాణానికి గురువారం కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించారు. కడా అభివృద్ధిలో భాగంగా రూ.8.80 కోట్లతో సమీకృత మండల కార్యాలయం, భూనీడు గ్రామంలో జూనియర్ కాలేజీ నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ విలోక్, ఏఈ అంజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



నిడ్జింతలో టీసేఫ్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

కొత్తపల్లి: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని షీటీం పోలీసులు పేర్కొన్నారు. గురువారం కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైనపుడు టీసేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. టీసేఫ్ యాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వేధింపులకు గురైన వారు 8712670398 లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు చెన్నయ్య, బాల్‌రాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

మక్తల్: మండలంలోని రుద్రసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తిరుపతి, హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు శ్రీకుమార్, ప్రహ్లాద్, మంజులత, శ్రీవరుణ ప్రమీప, దివ్యజ్యోతి, ఆంజనేయులు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం అందివ్వాలి

ఊట్కూరు: నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరామారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బాపూర్, తిప్రాస్‌పల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఎత్తిపోతల పథకంలో కోల్పోతున్న రైతుల భూములను పరిశీలించారు. రైతులతో సమావేశం నిర్వహించి పథకంపై అవగాహన కలిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మశ్చచందర్, బలరాం, రైతులు వడ్ల వెంకటయ్య, బుగ్గప్ప, హనుమంతు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



బాపూర్ శివారులో రైతులతో మాట్లాడుతున్న వెంకటరామారెడ్డి

ఉదండాపూర్ పరిహారంలో భారీ అక్రమాలు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- అక్రమార్కుల ఖాతాల్లో రూ.కోట్లు జమ
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్ పరిధిలో నిర్వాసితులకు ప్రభుత్వం అందించిన పరిహారం విషయంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని రూ.కోట్లు అక్రమార్కుల ఖాతాల్లోకి చేరిందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. వల్లూరు, ఉదండాపూర్ తదితర తండాలలో నిర్వాసితుల ముసుగులోఅనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా అవకతవకలు కొనసాగాయని, ఆయా అక్రమాలు బయటకు వస్తాయన్న కారణంగా అధికారులను సర్వే చేయకుండా బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. నిర్వాసితుల కోరిక మేరకు రీసర్వే నిర్వహించగా బోగస్ పేర్లు బహిర్గతమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వల్లూరులో 1,005 ఇళ్లకు సంబంధించి సర్వేలో పేర్కొనగా.. తరువాత రీసర్వేలో 547 మాత్రమే అర్హులుగా ఉన్నట్లు తేలిందన్నారు. అలాగే ఉదండాపూర్‌లో రీసర్వే చేసేందుకు అధికారులు వెళ్లగా బీఆర్ఎస్‌కు చెందిన వారు అడ్డుకున్నారని తెలిపారు. ఇక్కడ రీసర్వే చేపడితే తమ అక్రమాలు బయటపడతాయని అడ్డుకుంటున్నారని, రీసర్వే చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. భూమి ఒకరిదయితే పరిహారం మరొకరి ఖాతాలోకి వెళ్లిందని తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేసి ప్రభుత్వంతో నిర్వాసితుల పక్షాన తానే ముందుండి పోరాడుతున్నానని అన్నారు. కానీ స్వార్థంతో కొందరు తమకు సహకరించకుండా ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. సెట్విన్‌కు కేటాయించిన భవనంలో రూ.20 లక్షల తన సొంత ఖర్చుతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

■ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ నిత్యానందం పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబు కోరారు. పట్టణంలోని ఒకటో వార్డులోని పలు కాలనీల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. రాజావళి దర్గా వెనకాల ఏపుగా పెరిగిన ముళ్ల పొదలతో పాటు చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికుల ద్వారా తొలగించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కుళాయి నీటిని వృథా చేయకుండా.. తమ అవసరం మేరకు వినియోగించుకోవాలని సూచించారు.